| **Headline:** You can trade anywhere in the world | |
|---|---|
| **Source:** Andhra Jyothi | Date: 15 March 2016 |

# ప్రపంచంలో ఎక్కడైనా లిస్టింగ్

● కాని పోటీ ఎక్స్ఛేంజీలో కాదు ● ఎన్ఎస్ఇ మేనేజింగ్ డైరెక్టర్ చిత్రా రామకృష్ణ



న్యూఢిల్లీ : దేశీయంగా ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఒకటైన ఎన్ఎస్ఇని ప్రపంచంలో ఎక్కడైనా, ఏ ఎక్స్ఛేంజీలో అయినా లిస్టింగ్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆ ఎక్స్ఛేంజీ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ చిత్రా రామకృష్ణ అన్నారు. అయితే ఐపిఒ పర్యవేక్షణ బాధ్యత మరో పోటీ ఎక్స్ఛేంజీ చేతుల్లో కాకుండా దేశీయ రెగ్యులేటర్ లేదా తటస్థ సంస్థది అయి ఉండాలని ఆమె స్పష్టం చేశారు. నిఫ్టీలో ప్రస్తుతం 1400 కంపెనీలు లిస్టింగ్ అయి ఉన్నాయి. తమ షేర్‌హోల్డర్లకు మెరుగైన విలువను అందించేందుకు ఎన్ఎస్ఇని లిస్టింగ్ చేయాలని సంస్థ భావిస్తోంది. సొంత వేదికపై లిస్టింగ్ కావడం అనేది తార్కిక ప్రాధాన్యతేనంటూ పర్యవేక్షణ పోటీ ఎక్స్ఛేంజీ చేతుల్లో ఉండరాదన్నది కూడా అదే తర్కంతో చెబుతున్న మాట అని ఆమె వివరించారు. అయినప్పటికీ దేశీయంగా లిస్టింగ్ కావడమే తమ ప్రాధాన్యత అని కూడా చిత్ర తేల్చి చెప్పారు. ఏ ఎక్స్ఛేంజీ అయినా తన సొంత వేదికపై లిస్టింగ్ కారాదని, మరో ఎక్స్ఛేంజీలో మాత్రమే లిస్టింగ్ కావాలని (క్రాస్ లిస్టింగ్) సెబి నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. క్రాస్ లిస్టింగ్‌ను ఎన్ఎస్ఇ తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా పోటీ ఎక్స్ఛేంజీ బిఎస్ఇ మాత్రం అందుకు సంసిద్ధత ప్రకటించింది. దీంతో బిఎస్ఇ ఐపిఒకు సెబి ఇటీవల ఆమోదముద్ర వేసింది. త్వరలో డ్రాఫ్ట్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసి 6 నుంచి 9 నెలల కాలంలో ఐపిఒకి వచ్చేందుకు బిఎస్ఇ సన్నాహాలు చేసుకుంటోంది. క్రాస్ లిస్టింగ్‌ను వ్యతిరేకిస్తున్న ఎన్ఎస్ఇ మాత్రం సొంత వేదికపై లిస్టింగ్ అయ్యేందుకు వీలుగా తమ వాణిజ్యపరమైన విధులను, నియంత్రణాపరమైన విధులను వేరు చేస్తూ పునర్నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

## ప్రయోజనాల వైరుధ్యం తప్పదు

స్టాక్ ఎక్స్ఛేంజిలు సొంత వేదిక పైనే లిస్టింగ్ కావడం వల్ల ప్రయోజనాల వైరుధ్యం ఏర్పడుతుందని, కాని క్రాస్ లిస్టింగ్ అంశంపై ఎవరికైనా ఎలాంటి సమస్యలైనా ఉంటే వాటిని పరిశీలించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సెబి చెబుతోంది. దేశంలోనే కావచ్చు, విదేశాల్లోనే కావచ్చు స్టాక్ ఎక్స్ఛేంజిలకు పలు విధులుంటాయని, బ్రోకర్లందరికీ రెగ్యులేటర్‌గా ఉండడం వాటిలో ప్రధానమైనదని సెబి ఛైర్మన్ యుకె సిన్హా అన్నారు. మీరే లాభాపేక్ష కోసం పనిచేసే పరిస్థితి వస్తే మీకు ఆదాయం అందించే కంపెనీలపై చర్య తీసుకునే అధికారాలకు, వాణిజ్యపరమైన బాధ్యతలకు మధ్య ప్రయోజన వైరుధ్యం రాకుండా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. స్టాక్ ఎక్స్ఛేంజీల యాజమాన్యం, పాలనాపరమైన అంశాలను పరిశీలించిన బిమల్ జలాన్ కమిటీ కూడా సెల్ఫ్ లిస్టింగ్ ఉండరాదని తేల్చి చెప్పింది.